www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 4 జనవరి 2025

5

తిరుపతి

రేపు గూడూరులో రౌండ్‌టేబుల్ సమావేశం

గూడూరు టౌన్ : గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలన్న ప్రధాన డిమాండ్‌తో 5న ఆదివారం షాదీమంజీలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పట్టణ కార్యదర్శి కాలేషా తెలిపారు. గూడూరును తిరుపతి జిల్లాలో కలిపినందువల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా సిఎం చంద్రబాబు, యువగళం పాదయాత్రలో నారా లోకేస్ గూడూరుకు వచ్చినపుడు నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయకులు శశికుమార్, ఎంబేటి చంద్రయ్య, పామంజి మణి, పంటా శ్రీనివాసులురెడ్డి, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉద్యమ దిశగా వలంటీర్లు

- రూ.10వేలు వేతనం ఇవ్వాలి
- నేడు జిల్లావ్యాప్తంగా దీక్షలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'అటు వైసిపి ప్రభుత్వాన్ని నమ్మాం.. ఇటు కూటమి హామీలను విన్నాం.. వలంటీర్లను ఉద్యోగాల నుంచి తొలగించబోమని, రూ.10వేలు వేతనం ఇస్తామని ప్రస్తుత సిఎం నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచార హామీలో భాగంగా చెప్పారు. ప్రస్తుతం బకాయి వేతనాలు ఇవ్వకుండా, ఉద్యోగ భద్రత కల్పించకుండా రోడ్డున పడేశారు.. ప్రభుత్వాల మాటలు నమ్మి మోసపోయాం. ఉద్యోగ భద్రత కల్పించేంత వరకూ ఉద్యమిస్తాం.. శనివారం జిల్లావ్యాప్తంగా దీక్షలు చేపట్టనున్నాం' అని వలంటీర్లు వెల్లడించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే వార్డు వాలంటీర్ల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. విధులు అప్పగించకుండా పక్కన పెట్టింది. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని వాలంటీర్లు రోడ్డెక్కి ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. తిరుపతి జిల్లాల్లో 15 వేల మంది వాలంటీర్లు ఉన్నట్టు అంచనా. ఒక్క తిరుపతి అర్బన్ మండలంలోనే 2 వేల 400 మంది వాలంటీర్లు ఉన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో అయితే మాజీ ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాటలు నమ్మి నియోజకవర్గంలోని వాలంటీర్లు అందరూ రాజీనామాలు చేశారు. జిల్లావ్యాప్తంగానూ ఎన్నికలకు ముందు రాజీనామాల పర్వం నడిచింది. ప్రస్తుతం ఉపాధి లేకపోవడంతో పూటగడవడం కష్టంగా మారింది.

వైసిపి ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చింది. ఒక్కొక్క వాలంటీరు ఒక్కో క్లస్టర్‌లో పనిచేసేవారు. నెలకు వారికి గౌరవ వేతనంగా 5000 రూపాయలు ఇచ్చేవారు. ఒక క్లస్టర్ కి 50 ఇల్లు నుంచి 70 ఇల్లు వరకు చూసేవారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వాలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేసేవారు. ఇందులో ప్రధానంగా పెన్షన్లు, రేషన్ బియ్యం ఇతర సంక్షేమ పథకాలు వాలంటీర్ల ద్వారా అందజేసేవారు. ఎన్నికల ముందు చాలామంది వాలంటీర్లు వైసిపి పార్టీ నేతలు ఒత్తిడి చేయడంతో రాజీనామా చేశారు. మరి కొంతమంది రాజీనామా చేయకుండానే విధుల్లో ఉంటున్నారు. కూటమి ప్రభుత్వం వలంటీర్ల చేత ఎలాంటి పనులు చేయించకుండా పక్కన పెట్టింది. తమను విధుల్లోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకపోయింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా తమను పట్టించుకోకపోవడంతో ఉపాధి కల్పించాలని కోరుతూ తిరుపతి జిల్లాలో శనివారం నుంచి దీక్షలు చేయనున్నట్లు ప్రకటించారు. శుక్రవారమే చేయాల్సి ఉండగా పోలీసులు వారికి అనుమతి ఇవ్వకపోవడం గమనార్హం. కరోనా సమయంలోనూ ధైర్యం చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేశామని, అటువంటి తమను విధులకు దూరంగా పెడితే ఎలా బతకాలన్నది వారి ఆవేదన.

ఉపాధి భద్రత కల్పించేవరకూ పోరాటం : రామకృష్ణ, గౌరవాధ్యక్షులు, సిఐటియు

వాలంటీర్లకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించే వరకూ మా మద్దతు ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఎన్నో ఆశలు పెట్టుకున్న వాలంటీర్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలి. వారికి ఉద్యోగ భద్రత కల్పించేంత వరకూ పోరాడతాం. శనివారం తిరుపతి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తాం. అధికారులు అందరూ సహకరించాలి.

కుష్టురోగులకు సాయం చేశాం

సుప్రజ, వాలంటీర్

కరోనా సమయంలో కుష్టు రోగులకు ప్రతినెలా వారి వద్దకు వెళ్లి పెన్షన్లు ఇచ్చేవాళ్లం. మా ఆరోగ్యం కూడా పరిగణనలోకి తీసుకోకుండా సేవ చేశాం. ప్రభుత్వం మాపై జాలి చూపకపోవడం శోచనీయం. మాకు ఉద్యోగ భద్రత కల్పించి గౌరవ వేతనం 10 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడంలో వాలంటీర్ల సేవలు ముందుంటాయి. రాష్ట్ర ప్రభుత్వం మాకు ఉద్యోగ భద్రత కల్పించి ఉపాధి అవకాశాలు ఇప్పించడానికి చర్యలు తీసుకోవాలి.

ప్రశ్నించేతత్వాన్ని ప్రోత్సహించాలి

పరిశోధనలతోనే నూతన ఆవిష్కరణలు : కలెక్టర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నూతన ఆవిష్కరణల కోసం పరిశోధనలు ఆవశ్యకమని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్‌విబిఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు రేకెత్తించేలా ఉపాధ్యాయులు చొరవచూపాలన్నారు. సమాజ హితం కోసం వినియోగించుకునేలా ఆవిష్కరణ ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఉత్పాదకతను పెంచుకునేందుకు దోహదపడాలన్నారు. విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను పాఠశాల, మండల స్థాయిలలో తరచూ నిర్వహించాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణలను పరిశీలించిన కలెక్టర్ ప్రదర్శనలు ఆలోచన రేకెత్తించేలా ఉన్నాయని అభినందించారు. తాను చదువుకునే రోజులను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగినప్పుడే ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి వ్యక్తిగత, విద్యార్థి సామూహిక, ఉపాధ్యాయ విభాగాల్లో జిల్లాస్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విజేతలకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు. డివైఈవో ప్రభాకర్ రాజు, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య, భాస్కర్, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, కష్టయ్య మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలు..అద్భుతం..!

ఆలోచింపజేసిన జిల్లాస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఏ దేశమైనా అభివృద్ధి పటంలో అగ్రగామిగా నిలవాలంటే శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందంజలో ఉండాలి. అభివృద్ధి చెందిన చైనా, అమెరికా, జపాన్, రష్యా లాంటి దేశాలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విప్లవాన్ని తీసుకొచ్చాయి. శాస్త్రీయంగా, సాంకేతికంగా మెరుగైన మానవ వనరులను తీర్చిదిద్దుకోవడానికి భారీగా నిధులను వెచ్చిస్తున్నాయి. భారత దేశం సైతం విశ్వవ్యాప్తంగా ఆ తరహా సత్తా చాటుకోవాలంటే విద్యార్థులకు శాస్త్ర సాంకేతికత రంగాలు, పరిశోధనలపై ఆసక్తిని పెంచడం అత్యావశ్యకం. ఆ దిశలోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేస్తూ సైన్స్ ఫెయిర్ ల పేరిట తరగతి గదుల్లోనే భావి శాస్త్ర వేత్తలను తీర్చిదిద్దుతున్నాయి. తద్వారా మానవాళి మనుగడకు అవసరమైన కొత్త కొత్త ఆవిష్కరణలు చేసేందుకు భావి శాస్త్ర వేత్తలు ముందుకొస్తున్నారు. విద్యకు తోడు తమ మేధోశక్తిని జోడించి సరికొత్త సజనాత్మకతను వెలుగులోకి తెస్తున్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పలు ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. ఆలోచింపజేశాయి. వాటిలో కొన్నింటి విశేషాలు.

ఆకట్టుకున్న కల్లివెట్టు రాకెట్‌నమూనా

శ్రీకాళహస్తిలోని బాలురు ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో బుచ్చినాయుడు కండ్రిగ మండలానికి చెందిన కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన రాకెట్ నమూనా పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రాకెట్ నమూనాను సందర్శించిన జిల్లా విద్యాశాఖాధికారి కుమార్ అభినందించారు. ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్, ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, నాదెండ్ల మురళి, లక్ష్మయ్య, దాసు విద్యార్థులు పాల్గొన్నారు.

ముట్టుకుంటే మడత పెట్టేస్తుంది

వెంకట సాయి, టెన్త్‌క్లాస్, సూళ్లూరుపేట



ప్రస్తుతం మహిళా సమాజం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య లైంగిక వేధింపులు, అత్యాచారాలు. వీటినుంచి మహిళలు తమను తాము రక్షించుకునేందుకు సరికొత్త గాడ్జెట్ ను రూపొందించారు సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి వెంకట సాయి. పైసా ఖర్చు లేకుండా పాడైపోయిన మొబైల్, చార్జర్, బజ్ బటన్ల సాయంతో 'ఉమెన్ సేఫ్టీ గాడ్జెట్' ఆయన తయారు చేశారు. ఈ గాడ్జెట్ వల్ల ప్రమాదంలో ఉన్న మహిళలు తమను తాము రక్షించుకునే అవకాశం ఉంటుంది. లైంగిక దాడి చేసే ప్రమాదం ఉన్నా, అనుచితంగా ప్రవర్తించినా బటన్ నొక్కి గాడ్జెట్‌ను దాడికి పాల్పడే వ్యక్తికి తాకిస్తే 100 నుంచి 200 వోల్ట్‌ల విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలే అవకాశం ఉంటుంది. ఈ గాడ్జెట్‌ను మరింత ఆధునికరిస్తే మహిళలు తమ హ్యాండ్ బ్యాగ్ లో మొబైల్ లాగానే తీసుకుని వెళ్లే అవకాశం ఉంటుంది.

పొగను చూస్తే అలారం

టి.శరణ్య, నారాయణవనం

మానవాళి ఎదుర్కొంటున్న మరికొన్ని ముంపుల్లో అగ్నిప్రమాదాలు కూడా ముందు వరుసలో ఉంటాయి. ఈ అగ్ని ప్రమాదాలను ముందస్తుగా గుర్తించేందుకు స్మోక్ డిటెక్టర్‌ను కనిపెట్టారు నారాయణవరం మండలం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని టీ శరణ్య. ఆర్డ్యునో యునో, స్మోక్ సెన్సార్, బజర్, జంపర్ వైర్ సాయంతో స్మోక్ డిటెక్టర్ ను తయారు చేశారు. నిప్పు లేనిదే పొగరాదన్నట్లు.. పొగ వచ్చే సమయంలోనే ఈ పరికరం సెన్సార్ సాయంతో అలారం మోగిస్తుంది.

సాంకేతిక సొబగులద్దితే ఈ పరికరం క్షేత్రస్థాయిలో అగ్ని ప్రమాదాల నివారణకు దోహద పడుతుంది.

వాన నీటి సద్వినియోగం

రాజశేఖర్, ఓబులరెడ్డివారిపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల, పాకాల

నీటి వృధాను అరికట్టడం నేడు అత్యంత ఆవశ్యకమైంది. నీటి బొట్టు.. ఒడిసి పట్టు అంటూ ప్రభుత్వాలు నినాదాన్ని ఇస్తున్నాయి. ఈ క్రమంలో వాన నీటినివృధా కాకుండా ఒడిసి పట్టుకోవడం ఎలాగో తమ ప్రయోగం ద్వారా చేసి చూపించారు పాకాల మండలం ఓబుల రెడ్డివారిపల్లి జడ్పీ ఉన్న ఉన్నత పాఠశాల విద్యార్థి రాజశేఖర్. రైన్ వాటర్ హార్వెస్టింగ్ పేరిట కార్డ్‌బోర్డ్స్, డ్రాయింగ్ చార్ట్, మోటార్, స్మాల్ ట్యూబ్స్, లైట్లు, ఎల్‌ఈడి లైట్లు, స్విచ్లు తోటి డాబాలపై నుంచి వచ్చే వాన నీటిని ఒడిసి పట్టుకోవడం.. నిల్వ చేసుకోవడం ఎలాగో చూపించారు. ఇంటి అవసరాలతో పాటు, వేసవికాలంలో పెరటి మొక్కలకు నీటి సౌకర్యాన్ని అందించే అవకాశం ఉంటుంది.

'అగర్వాల్' స్టీలు పరిశ్రమపై..

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

కలెక్టర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అగర్వాల్ స్టీల్ పరిశ్రమ యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా రెండవ సారి ఓ కార్మికుడు మతి చెందారని, అయిదుగురు తీవ్ర గాయాలకు గురయ్యారని, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి. బాలసుబ్రమణ్యం, కందారపు మురళి, ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజులు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సిఐటియు నేతలు కార్యాలయ అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించారు. వినతి పత్రంలో అగర్వాల్ స్టీల్ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం కారణంగా ఈ దుస్థితి దాపురించిందని గుర్తు చేశారు. అగర్వాల్ యాజమాన్యం మొదటి నుంచి పలు అక్రమాలకు పాల్పడటం, కార్మికుల పట్ల బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించటం, వలస కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాలు ప్రభుత్వ దష్టిలో ఉన్నాయా? అని ప్రశ్నించారు. మొదటిసారి ఘటన జరిగినప్పుడే అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించి ఉంటే రెండవసారి ఇలాంటి ఘటన జరిగేది కాదని వారు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. మతుని కుటుంబానికి కోటి రూపాయలు, క్షతగాత్రులకు రూ. 25 లక్షల నష్టపరిహారాన్ని యాజమాన్యం నుంచి అందించాలని, గాయాలతో ఆసుపత్రిలో ఉన్నవారికి నాణ్యమైన, మెరుగైన వైద్యాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు జరగటం నాలుగవ దఫా అని తిరుపతి జిల్లాలో పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఉంటున్న కారణంగా అన్ని పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలపై తనిఖీలు జరపాలని సూచించారు.

సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

స్ఫూర్తిప్రదాత సావిత్రిబాయి పూలే

ప్రజాశక్తి - యంత్రాంగం

స్ఫూర్తిప్రదాత సావిత్రిబాయి పూలే అని వక్తలు ఉద్ఘాటించారు. జిల్లావ్యాప్తంగా సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకుని నివాళి అర్పించారు. కొన్నిచోట్ల ఉత్తమ మహిళా టీచర్లను సత్కరించారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ భద్రమణి ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఐద్వా జిల్లా సెక్రటరీ డాక్టర్ సాయిలక్ష్మి, అధ్యక్షులు జయంతి పాల్గొన్నారు. శ్రీవారిమెట్టు వ్యాపారస్తులు దీక్షా శిబిరం వద్దనే నివాళి అర్పించారు. రేణిగుంటలో జెవివి ఆధ్వర్యంలో జ రిగింది.



మహిళా వర్సిటీలో...

జీవకోన జడ్‌పి హైస్కూల్లో హెడ్మాస్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు.

తిరుపతి మల్లంగుంట హైస్కూల్లో రైతుసంఘం జిల్లా కార్యదర్శి హేమలత ఆధ్వర్యంలో సభ జరిగింది. సీతమ్మనగర్ కూడలిలో బిసి సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. మేయర్ డాక్టర్ శిరీష, ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, బిసి సంఘర్షణ సమితి సభ్యులు లక్ష్మయ్యయాదవ్ పాల్గొన్నారు. ఎస్వీయూ సెనెట్ హాలులో ఎస్సీ, ఎస్టీ విద్యార్థి పరిశోధక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి పాల్గొన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఆచార్యులు పి. హేమకు ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు అందించారు. యూనివర్సిటీ ప్రకాశం భవనంలో బిసి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణగౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజినీకి సావిత్రిబాయి పూలే అవార్డుతో విసి ఆచార్య ఉమ సత్కరించారు. జీవకోనలోని విశ్వం హైస్కూల్లో బిసి కులాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో బివి కేశవులు ఉదయార్, సీనియర్ న్యాయవాది రమణయ్య ఆధ్వర్యంలో జరిగింది.

కెవిబిపురంలో సిపిఎం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు ఆధ్వర్యంలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో నివాళి అర్పించారు. పుత్తూరు టౌన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించారు. బలహీనవర్గాల బాలికల భవిష్యత్ కోసం సావిత్రిబాయి విశేష కృషి చేశారన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య, వి.వీరయ్య పాల్గొన్నారు. గూడూరులో సిపిఎం ప్రాంతీయ ఆర్గనైజర్ జోగి శికుమార్ ఆధ్వర్యంలో ఆర్ అండ్‌బి కార్యాలయం ఎదుట ఉన్న సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహానికి నివాళి అర్పించారు. పెళ్లకూరులో ఎంఇఒ శంకరయ్య ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో నిర్వహించారు. నేపల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. తడమండలంలోని కాశింగాడు కుప్పం ఎంపియుపి పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు పి.పద్మజారాణి, సంధ్యాలక్ష్మిలను ప్రధానోపాధ్యాయులు రఘురామయ్య, వార్డు మెంబర్ ఇంద్రజ సత్కరించారు. విద్యార్థులకు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. రేణిగుంటలో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో అధ్యక్షులు జూలియన్‌రాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎంఇఒ ఇందిరాదేవిని సత్కరించారు. శ్రీకాళహస్తిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. అదేవిధంగా స్కిమ్స్ కళాశాలలో కరెస్పాండెంట్ మిద్దెల హరి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ గీతా తదితరులు పాల్గొన్నారు. తిరుపతి ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విస్డమ్‌క్లబ్ ఉయ్ సపోర్టు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు.

విద్యుత్ బస్సులను ఆర్టీసీనే నిర్వహించాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్

విద్యుత్ బస్సుల నిర్వహణను ఆర్టీసికి అప్పగించాలంటూ ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.శివకుమార్ డిమాండ్ చేశారు. గూడూరు సిఐటియు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్న సందర్భంగా నిర్వహణ బాధ్యతలు ఆర్టీసీకి అప్పజెప్పాలన్నారు. 2029 నాటికి విద్యుత్ బస్సులను తీసుకురావాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. మొదటినుంచి తమ యూనియన్ విద్యుత్ బస్సుల నిర్వహణను ఆర్టీసికి అప్పగించాలని కోరుతున్నామన్నారు. వాతావరణ కాలుష్యం సాకుతో విద్యుత్ బస్సులను తెప్పిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు డీజిల్ బస్సుల వల్ల కాలుష్యం 0.69 శాతం మాత్రమేనని అన్నారు. పరిశ్రమల వల్ల 50శాతం, ఇతర కారణాల వల్ల 25 శాతం కాలుష్యం ఏర్పడుతుంటే డీజిల్ బస్సుల వల్ల కాలుష్యం అని అసత్య ప్రచారం చేయడాన్ని మానుకోవాలన్నారు. రాష్ట్రంలో ఏడాదికి రెండువేల మంది ఆర్టీసీలో రిటైర్ అవుతున్నారని, మూడువేల విద్యుత్ బస్సులు ఆర్టీసీలోకి వస్తున్నాయన్నారు. దాదాపుగా అన్ని సెక్షన్లలోనూ 15వేల మంది ఉద్యోగులకు ఇబ్బంది కలుగుతుందని, ఉచిత మహిళ ప్రయాణం పథకం ఏ కేటగిరీ బస్సులకు వర్తిస్తుందో ఇప్పటివరకూ స్పష్టత లేదన్నారు. ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బస్సుల స్పేర్ పార్ట్స్ నిర్వహణ నాలుగు వర్కుషాపులలో మెకానికల్ సిబ్బందికి శిక్షణ ఇస్తే సమర్థవంతంగా చేయగలరన్నారు. జనవరి 7వ తేదీ విజయవాడలో జరిగే రాష్ట్ర సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎం. శేషయ్య, ఎస్.డబ్ల్యు.ఎఫ్ సభ్యులు కె.యస్.వాసులు, ఎన్. రమేష్, పి.రవీంద్ర, కష్టయ్య, ప్రాంతీయ ట్రేడ్ యూనియన్ల నాయకులు జోగిశివకుమార్, సి.ఐ.టి.యు జిల్లా నాయకులు పి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

అరణియార్‌ను టూరిజంగా అభివృద్ధి చేస్తాం : జేసీ

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - పిచ్చాటూరు

అరణియార్ ప్రాజెక్టును అందరి సహకారంతో టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. ఇందుకుగాను తుడా నిధులను 2 కోట్ల 12 లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. 'ప్రజాశక్తి'లో 'అరణియార్‌కు పర్యాటక శోభ వచ్చేనా?' అంటూ గురువారం కథనం వెలువడింది. ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం జేసీ శుభం బన్సల్ మాట్లాడుతూ త్వరలోనే పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. తమిళనాడు ప్రజలు తిరుపతి పుణ్యక్షేత్రం చేరుకోడానికి పిచ్చాటూరు ప్రాజెక్టు మీదుగా వెళ్లడం వల్ల ఆర్థికంగా కలిసొచ్చే అవకాశం ఉందన్నారు. బృందావనం, లైట్‌హౌస్, చిల్డ్రన్‌పార్కులు పూర్తి చేస్తామన్నారు. సత్యవేడు ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం విజ్ఞప్తి మేరకు పిచ్చాటూరు జూనియర్ కాలేజీకి సంబంధించిన ప్రహరీగోడ, అదనపు గదులు, వసతిగృహానికి సిమెంట్ రోడ్డు మార్గాన్ని పూర్తి చేస్తామన్నారు. ఇరిగేషన్ డిఇ రామచంద్రమూర్తి, తహశీల్దార్ రమేష్ బాబు, ఇరిగేషన్ ఎఇ లోకేష్ పాల్గొన్నారు.

అరణియార్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న జేసీ

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - గూడూరు టౌన్

మున్సిపల్ కార్మికుల ఆందోళనల సందర్భంగా గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు శుక్రవారం సంఘం కార్యదర్శి ధారా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సాధారణంగా, ప్రమాదంలో మరణించిన మున్సిపల్ కార్మికులకు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి పని కల్పించాలని, ఎన్ఎంఆర్ ఇంజినీరింగ్ కార్మికులకు, క్లాప్ డ్రైవర్లకు, బదిలీ కార్మికులకు జీవో 36 వర్తింపజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, రక్షణ పరికరాలు ఇవ్వాలని, వాహనాలు మరమ్మతు చేయించాలని, సిబ్బంది సెలవు తదితర డిమాండ్లను అధికారులకు విన్నవించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకే తాము ధర్నా చేశాం తప్ప, కొత్త డిమాండ్లు ఏమీ కావన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో జనవరి 10వ తేదీన దీక్షలకు వెళతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప కార్యదర్శి సి.హెచ్.రాజేష్, ఉపాధ్యక్షులు ఏ.పెంచల ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్. వెంకట రమణయ్య, సంపూర్ణమ్మ, మణమ్మ, పట్టణ గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్ పాల్గొన్నారు.

దళితుల బాట ఆక్రమణను తొలగించండి : సిపిఎం

ప్రజాశక్తి - పిచ్చాటూరు

ఓబుల్ రాజు కండ్రిగ దళితులకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు వెళ్లే బాటను కొందరు భూస్వాములు ఆక్రమించారని తక్షణమే రెవెన్యూ అధికారులు ఆక్రమణను తొలగించాలని సిపిఎం సత్యవేడు నియోజకవర్గం ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓబుల్‌రాజు కండ్రిగ దళితులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ తమకు 2011లో డికెటి పట్టాలు మంజూరు చేశారని, గోవర్ధనగిరి గ్రామ సర్వే నంబర్ 66, 67లో పట్టాలిచ్చారని, ఈ భూములకు 30 లింకులు బాటను ఏర్పాటు చేశారని, అయితే గోవర్ధన గిరి గ్రామానికి చెందిన భూస్వామి ఆ బాటను ఆక్రమించరని చెప్పారు. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో ఈ విషయాన్ని తెలియజేశామన్నారు. ఈ సందర్భంగా జనార్ధన్ స్పందిస్తూ అధికారులు స్పందించకపోతే దళితుల ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. పిచ్చాటూరు మండలం నాయకులు రామచంద్రారెడ్డి, నారాయణవనం మండల నాయకులు ముని శంకర్, ఓబుల్ రాజు కండ్రిగ దళితులు పాల్గొన్నారు.

'ఆదిశంకర'లో కోడ్నెస్ట్ డ్రైవ్ విజయవంతం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు ఆదిశంకర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రాంగణంలో కోడ్నెస్ట్ సంస్థ 2025 బ్యాచ్ విద్యార్థుల కోసం ప్రత్యేక నియామక డ్రైవ్‌ను నిర్వహించింది. ఈ డ్రైవ్ "ట్రైన్ అండ్ హైర్" కార్యక్రమం కింద జరిగింది. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతో పాటు 30 లక్షల వరకు ప్యాకేజీతో ఉన్న ఉద్యోగ అవకాశాలను కల్పించడం ముఖ్య ఉద్దేశ్యం. ఈ నియామక ప్రక్రియలో గ్రూప్ డిస్కషన్ , టెక్నికల్ ఇంటర్వ్యూ అనే రెండు దశలు నిర్వహించారు. మొత్తం 27 మంది విద్యార్థులు ఈ ఎంపిక దశలను విజయవంతంగా పూర్తి చేసి కోడ్నెస్ట్ సంస్థలో ఉద్యోగ అవకాశాలను పొందారు. ఈ కార్యక్రమంలో కోడ్నెస్ట్ సీఈఓ ప్రభాకరం, కాలేజీ చైర్మన్ వంకి పెంచలయ్య, వైస్ చైర్మన్ వంకి అనూష , ప్రిన్సిపాల్ డాక్టర్ వేణు మాధవ్ , ప్లేస్మెంట్ ఆఫీసర్ అర్చన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామయ్య పాల్గొన్నారు.

'స్క్రాప్' కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలి : సిపిఐ

క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో గత కొద్దిరోజులుగా అక్రమంగా తరలిస్తున్నటువంటి స్క్రాప్ పై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు డిమాండ్ చేశారు. ఎస్ వి యూనివర్సిటీలో కొద్ది సంవత్సరాలు నుండి ఉన్నటువంటి స్క్రాప్‌ను అధికారులు వారి యొక్క ఆదాయ వనరులుగా మార్చుకున్నారని, దాదాపు 60 లక్షల రూపాయల విలువ ఉన్నటువంటి స్క్రాప్‌ను కేవలం 8.10 లక్షల ధరకు అమ్మడం సిగ్గుచేటు అన్నారు. తక్షణమే స్క్రాప్ టెండర్ ను రద్దు చేసి సరైన పద్ధతిలో స్క్రాప్ టెండర్ నిర్వహణ జరిపి దోపిడీకి కారణమైనటువంటి వారందరినీ వెంటనే సస్పెండ్ చేయాలని ఒక ప్రకటనలో తెలిపారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

మన్మోహన్‌సింగ్‌కు కాంగ్రెస్ నేతల నివాళి

తిరుపతి సిటీ : భారత దేశ ఆర్థిక వ్యవస్థ నేడు బలంగా ఉండటానికి, అభివద్ధి వైపు పరుగులు తీయడానికి ప్రధానమంత్రిగా ఆనాడు మన్మోహన్ సింగ్ గట్టి పునాదులు వేశారని, ఆయన లేని లోటు తీరనిదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. తిరుపతిలోని యూత్ హాస్టల్లో చిత్తూరు జిల్లా, తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీలో ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ 2007లో భారతదేశం అత్యధిక జీడీపీ వద్ధిరేటు 9 శాతం సాధించి ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివద్ధి చెందుతున్న రెండవ ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలవడానికి మన్మోహన్ సింగ్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలే కారణమని చెప్పారు.పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, కాంగ్రెస్ నాయకులు వెంకటాచలపతి, తలప దామోదర్ రెడ్డి, మురళి పాల్గొన్నారు.

నేడు, రేపు ఎపి హిస్టరీ కాంగ్రెస్ వార్షిక సమావేశం

గూడూరు టౌన్ : ఈనెల 4, 5 తేదీల్లో శని, ఆదివారం గూడూరు పట్టణంలోని ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ 47వ వార్షిక సమావేశం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి అధ్యక్షునిగా ఎస్వీయూ విశ్రాంత చరిత్ర ఆచార్యులు డాక్టర్ ఎఆర్ రామచంద్రారెడ్డి వ్యవహరిస్తారన్నారురు. లౌకిక దక్పథంతో శాస్త్రీయంగా చరిత్రను రచించడం, అభివద్ధి చేయడం, చరిత్ర , ప్రాచీన సాహిత్య అధ్యయనం, పరిశోధనకు తగిన తోడ్పాటును అందిచడం కోసం జాతీయ స్థాయిలో "ఇండియన్ కౌన్సిల్ అఫ్ హిస్టారికల్ రీసెర్చ్" ఏర్పాటయ్యింది.

మంగళంలో నకిలీ సర్వే ముఠా హల్చల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళంలో హైదరాబాదుకు చెందిన వారమని 360 మీడియా ఛానల్ అని చెప్పుకుంటూ మంగళం గ్రామపంచాయతీ నారా చంద్రబాబునాయుడు కాలనీలో ప్రజల నుండి వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తుండడంతో స్థానికంగా ఉన్న టిడిపి నాయకులు మీడియాకు సమాచారం అందించడంతో నకిలీ సర్వే ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సైబర్ నేరాలు రోజు రోజుకి అధికమవుతుండడంతో ఎక్కడ ఏ ప్రమాదం ముంచుకొస్తుందని, స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాలోత్సవంలో వీక్ష పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ :

తిరుపతిలో వేమన విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ స్కూల్ లో బాలోత్సవం కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీక్ష పాఠశాల విద్యార్థుల ప్రతిభ చాటారు. బాలోత్సవంలో వేల సంఖ్యలో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో వీక్ష పాఠశాల పిల్లలకు ప్రథమ, ద్వితీయ, తతీయ అవార్డులు సొంతం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆర్కే సంస్థల చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకష్ణారెడ్డి పేర్కొన్నారు. చదువులతో పాటు క్రీడలు, సాంస్కతిక కార్యక్రమాలలో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఆర్కే విద్యా సంస్థల డైరెక్టర్ విమల, అన్నమయ్య జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ అనగానే రెడ్డప్ప, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నారావారిపల్లెలో మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

650 మందికి ఉద్యోగ అవకాశాలు : కలెక్టర్

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్(నాని) అన్నారు. శుక్రవారం నారావారిపల్లెలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళా ను ఆయన ప్రారంభించారు.

ఈ జాబ్ మేళాలో 21 కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. 1832 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు యువతీ యువకులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను ఎంపిక చేసి మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 650 మంది నిరుద్యోగులకు వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు పైలెట్ ప్రాజెక్టు ప్రత్యేక అధికారిని సుశీల దేవి తెలిపారు. సాయంత్రం కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా అభ్యర్థులకు నియామకపు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివద్ధి సంస్థ అధికారి లోకనాథ్ రెడ్డి, డిఆర్డిఏ పిడి శోభన్ బాబు పాల్గొన్నారు.

బాబు వచ్చాడు..జాబ్ వచ్చింది

వారణాసి నాగప్రసన్న, యర్రావారిపాలెం మండలం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు సీఎం కుర్చీలో కూర్చున్నాడు. నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తున్నాయి. నా పేరు నాగ ప్రసన్న, ఎర్రవారిపాలెం మండలం, ఉస్తి కాయల పెంట గ్రామం, డిగ్రీ వరకు చదువుకున్నాను. గత సంవత్సరకాలం ఉద్యోగ అవకాశాలు లేక ఇంటికే పరిమితమయ్యాను. నారావారిపల్లి లో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో డిక్సన్ ప్రైవేట్ కంపెనీ ఇంటర్వ్యూలకు హాజరయ్యాను. సెలెక్ట్ అయ్యాను.... నెలకు 13,500, ఉచిత బస్సు సౌకర్యం, రాయితీతో భోజనం సౌకర్యాన్ని కంపెనీ అందిస్తుంది. చాలా సంతోషంగా ఉంది.

మాట నిలబెట్టుకున్నారు

ఆర్.మోహిత్, పాకాల

నా పేరు ఆర్. మోహిత్, మాది పాకాల మండలం, బైనపల్లి గ్రామం. నేను బీటెక్ వరకు చదువుకున్నాను. 2022 నుండి ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూశాను. గత వైసిపి ప్రభుత్వంలో ఉద్యోగ అవకాశాల జాడే లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, యువగళం పాదయాత్రలో నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం జాబ్ మేళాలో నిర్వహించి చెన్నైకి చెందిన వీల్స్ ఇండియా కంపెనీ లో ఉపాధి అవకాశాలు కల్పించినందుకు ప్రత్యేక కతజ్ఞతలు. ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులకు అభినందనలు తెలుపుకుంటున్నాను.

క్రైం న్యూస్

'డ్రంక్ అండ్ డ్రైవ్' పలువురికి జరిమానా

ప్రజాశక్తి -రేణిగుంట

రేవంతం నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పలువురికి జరిమానా విధించారు. డిఎస్‌పి పర్యవేక్షణలో ఎస్ఐలు తిరుపతి కోర్టుకు అప్పగించారు. మద్యం తాగి వాహనం నడిపిన ఎనిమిది మందికి 10వేల చొప్పున 80వేలు జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన వారికి 2వేల చొప్పున ఆరువేలు జరిమానా వేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

రుయా ఆసుపత్రి జల ప్రసాదం ఎదుట ఓ గుర్తు తెలియని 60 సంవత్సరాల వయసున్న వ్యక్తి ఆపస్మారక స్థితిలో పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే పక్కనే ఉన్న రుయా అత్యవసర విభాగానికి తరలించారు. రుయా వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి,మతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఎవరైనా మృతుడి వివరాలు తెలిస్తే, వెస్ట్ పోలీస్ లను సంప్రదించాలని పోలీసులు కోరారు.

శ్మశానవాటికలను శుభ్రంగా ఉంచండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని శ్మశానవాటికలను పరిశుభ్రంగా ఉంచాలని, గుంతలుగా ఉన్న రాజన్న పార్క్ రోడ్డు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజలు అందించే వినతుల మేరకు శుక్రవారం పలు ప్రాంతాల్లో అధికారులతో కలసి కమిషనర్ స్వయంగా పరిశీలించారు. అలాగే మూడు రకాల డోర్ నంబర్లను ఉన్నాయని, వాటిని పరిశీలించి ఒకే డోర్ నంబర్ ఉండేలా చూస్తామని అన్నారు. దామినేడు గృహాల్లో ఎన్ని ఖాళీ ఉన్నాయో సర్వే చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, తుడ ఇ.ఇ రవీంద్ర పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం 'ఓపెన్ ఫోరం'

పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఓపెన్ ఫోరమ్ నిర్వహిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తప్పకుండా ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించి, పట్టణ ప్రణాళిక విభాగంలో వచ్చే ఫిర్యాదులు చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. మార్చి నెలాఖరులోపు పెండింగ్ లో ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న టి.డి.ఆర్ బాండ్లు డోర్ నంబర్ కలిగిన వారికి మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఏసిపి బాలాజి, టిపిబిఓలు మధుసూదన్, వంశీ పాల్గొన్నారు.

సామూహిక ధర్నాలను జయప్రదం చేయండి : సిపిఐ

ప్రజాశక్తి -తిరుపతి సిటి

నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం సాగు, భూముల కోసం ప్రతి మండల కార్యాలయం వద్ద జరిగే సామూహిక ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బైరాగి పట్టణంలోనే సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేస్తామని ఎన్నికల హామీలను ఇచ్చారని, ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణమే అమలు చేయాలని, అందుకోసం అన్ని మండల కేంద్రాల కార్యాలయాల వద్ద సిపిఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సామూహిక ధర్నాలను అర్జీలను సమర్పించాలని ఆయన కోరారు. నాయకులు సిహెచ్ ప్రభాకర్, చిన్నం పెంచలయ్య, మహేష్ పాల్గొన్నారు.

వెలుగు సంఘం కాలమాన పట్టిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

తిరుపతి జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ఉద్యోగుల సంక్షేమ సంఘం వారు రూపొందించిన 2025 కాలమాన పట్టికను డిఆర్డిఏ పీడీ శోభన్ బాబు శుక్రవారం తన కార్యాలయంలో అసోసియేషన్ నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు పీడీ శోభన్ బాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కాలమాన పట్టిక ఆవిష్కరణ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు ఏ.నాగేంద్రరావు, అధ్యక్షులు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, సహాయ కార్యదర్శి సింగారం, ప్రభావతి పాల్గొన్నారు.

'వెలుగు' సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కిశోర' వికాసమే లక్ష్యం

శ్రీకాళహస్తి : కిశోర బాలికల వికాసమే లక్ష్యంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ముందుకెళ్తోందని తొట్టంబేడు మండల ఎంపీడీవో సురేంద్రనాథ్ అన్నారు. తొట్టంబేడు ఎంపీడీవో కార్యాలయపు సమావేశ మందిరంలో శుక్రవారం 'కిషోర్ వికాసం' కార్యక్రమం అమలుపై ఒక్క రోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. కౌమార బాలికలను సంఘటితం చేసి సమస్యలు పరిష్కరించుకునేలా చైతన్య పరచాలని సూచించారు. సీడీపీఓ శాంతిదుర్గ, ఎంఈవో భారతి, వైద్యాధికారిణి తేజ పాల్గొన్నారు.

తోపుడుబండ్ల వ్యాపారులకు ఐడి కార్డులివ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తోపుడుబండ్ల వ్యాపారులపై పెటి కేసులు బనాయించడం దారుణమని, వారికి మున్సిపల్ అధికారులు ఐడి కార్డులు మంజూరు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. యశోదానగర్‌లోని సిఐటియు కార్యాలయంలో తోపుడుబండ్ల వ్యాపారుల జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. తోపుడుబండ్ల వ్యాపారులకు సంబంధించి ప్రభుత్వం 2014లోనే పార్లమెంట్‌లో చట్టం చేసిందని, అయితే ఈ చట్టాలను మున్సిపల్ అధికారులు, పోలీసులు తుంగలో తొక్కారన్నారు. వీరికి 'ముద్ర' లోన్లు మంజూరు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షులుగా రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పి.బుజ్జి, కోశాధికారిగా నిర్మల్ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కె.గోవిందు, మునీంద్ర ఎన్నికయ్యారు.

స్లాటెడ్ టోకెన్ల జారీకి పటిష్ట చర్యలు : టిటిడి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో భక్తులు శ్రీవారి దర్శించుకునేందుకు వీలుగా జారీ చేయనున్న సర్వదర్శనం టోకెన్ల కేంద్రాలలో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు తిరుపతి జేఈవో ఎం. గౌతమి సూచించారు. తిరుపతి పరిపాలన భవనంలో శుక్రవారం అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. 2025 జనవరి 10 నుండి 19వ తేదీ వరకు 10 రోజుల పాటు వైకుంఠ ఏకాదశి దర్శనాల కోసం టోకెన్లు జారీకి ఏర్పాట్లు చేస్తున్నసౌకర్యాలలో అలసత్వం వహించరాదన్నారు. తిరుపతిలో ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, బైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా తిరుమల స్థానికుల కొరకు తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లోని కౌంటర్లలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈసారి భక్తులకు ఫోటోతో కూడిన స్లిప్ లను జారీ చేయనున్న తరుణంలో ఆధార్ కార్డులను క్రోడీకరించే సమయంలో సాంకేతిక సమస్యలు రాకుండా ఐటీ విభాగం మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అకౌంట్స్ అధికారి వెంకటరమణ, విజివో సదాలక్ష్మి, ముఖ్య వైద్యాధికారి డా. నర్మద పాల్గొన్నారు.

పొలంబడి కార్యక్రమం

శెంగుంద వీధిలో కుంగిన కల్వర్టు

పుత్తూరు టౌన్ : పట్టణంలోని శెంగుంద వీధి ప్రారంభంలో కల్వర్టు కొంతకాలం క్రితం కుంగిపోయి ఉంది. దీంతో ఆ వీధిలోకి రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో జయ చంద్ర మేస్త్రి శుక్రవారం ఉచితంగా తనవంతు సేవ చేశారు. కుంగిన కల్వర్ట్ నిర్మాణానికి కావాల్సిన మెటీరియల్, సిమెంటు గుల్లను డాక్టర్ ముని రాజా అందజేశారు. మున్సిపాలిటీ అధికారులు మీద ఆధారపడకుండా దాతలే కల్వర్ట్ చేయడం చూసి ఆ వీధి ప్రజలు హర్షం వక్తం చేశారు.

'పనిచేసిన కార్యకర్తలను విస్మరిస్తున్నారు'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) టిడిపిలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలను మండల స్థాయి నాయకులు విస్మరిస్తున్నారని రామచంద్రపురం మండలం అనుప్పల్లి గ్రామపంచాయతీకి నూతిగుంటపల్లికి చెందిన బూత్ కన్వీనర్ పురుషోత్తం ఆవేదన వ్యక్తం చేశారు. రామచంద్రపురం మండలంలో తనలా చాలామంది కార్యకర్తలు అంతర్గతంగా కుమిలిపోతున్నారని అన్నారు. ఇకనైనా అధిష్టానం క్షేత్రస్థాయి కార్యకర్తల సమస్యలను పట్టించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'ఈ క్రాఫ్ పంట బీమా'ను సద్వినియోగం చేసుకోవాలి

బుచ్చినాయుడు కండ్రిగ : ఈ క్రాప్ పంట బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ భారతి సూచించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా జంబుగోళం, గోవిందప్పనాయుడు కండ్రిగ పంచాయతీల్లో పొలాల్లోకి వెళ్లి వరద నష్టాన్ని పరిశీలించారు. వరి పైరు నాటిన 45 రోజుల్లోగా నష్టపోతే వరి విత్తనాలు మాత్రమే రైతులకు సబ్సిడీగా ఇస్తుందన్నారు. రబి 2024- 25 సీజనుకు పంట ఇన్స్యూరెన్సు సంబంధించి వరికి ప్రీమియం రూ.630ను డిసెంబర్ 31, వేరుశనగకు రూ. 450 జనవరి15లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. సిఎస్సి సెంటర్లో రైతులు క్రాఫ్ ఇన్సూరెన్స్ నమోదు చేసుకోవాలన్నారు. ఉలవలు, వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. గ్రామ సభలో నిర్వహించి పంట పొలాలలో రైతులు పాటించాల్సిన మెళుకువలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

ఎ.రంగంపేటలో మినీ గోకులానికి శంకుస్థాపన

రామచంద్రాపురం (చంద్రగిరి) : పాడిరైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. శుక్రవారం మండలంలోని ఏ రంగంపేట గ్రామంలో పాడి పశువుల సౌకర్యం కోసం 103 గోకులాల షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వగ్రామమైన నారావారిపల్లి ప్రాంతాన్ని (ఏ రంగంపేట నుండి భీమవరం వరకు) పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అభివద్ధి, సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తున్నామన్నారు. ఈ గోకులాలకు ప్రభుత్వం రూ.2 కోట్ల 2 లక్షల 80 వేల రూపాయలను మంజూరు చేసిందన్నారు. పైలెట్ ప్రాజెక్టు ప్రత్యేక అధికారిణి సుశీల దేవి, డిఆర్డిఏ పీడీ టిఎన్ శోభన్ బాబు పాల్గొన్నారు.

డైరెక్టరీ పుస్తకాన్ని ఆవిష్కరించిన వాకర్స్

తిరుపతి టౌన్ : తిరుపతి కేశవాయనగుంట నందలి శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల మైదానంలో 2025 వాకర్స్ ఇంటర్నేషనల్ డైరెక్టరీ పుస్తకాన్ని గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఆర్కాట్ కష్ణప్రసాద్, కోనేటి రవిరాజు, గోపిప్రసాద్ ఆవిష్కరించారు. గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు డైరెక్టరీ ని అందజేశారు.

పాఠశాలలో ఎంఇఒ తనిఖీలు

బిఎన్ కండ్రిగ : శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రమణ్యం, విద్యా కమిటీ వైస్‌ఛైర్మన్ చెంగయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం నెలవాయిలోని జిల్లా పరిషత్ స్కూల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

వలస కార్మికునిపై దౌర్జన్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

బతుకుదెరువు కోసం ఊరుగాని ఊరొచ్చిన ఓ వలస జీవిపై దౌర్జన్యకాండ జరిగింది. పానీ పూరీ తిని తీరా డబ్బులివ్వకుండా ఆ బండినే కాలితో తన్ని రోడ్డుపై తోసేసి ధ్వంసం చేసి వెళ్ళాడో పొగరుబోతు. సభ్య సమాజం తలదించుకునే ఈ ఘటన పుచ్చలపల్లి సుందరయ్య భవన్ సాక్షిగా స్థానిక దక్షణ కైలాసనగర్ లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి పోతే.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ప్రదీప్ కుటుంబం బతుకుదెరువు కోసం పొట్ట చేత పట్టుకుని 20 ఏళ్ల కిందట శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చింది. ప్రదీప్ దక్షిణ కైలాస నగర్లో పానీ పూరి బండి పెట్టుకొని తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో దక్షిణ కైలాస నగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి పానీపూరి తినేందుకు ప్రదీప్ వద్దకు వచ్చాడు. తీరా పానీ పూరి తిన్నాక డబ్బులివ్వమన్నందుకు బండిని కాలితో తన్ని, రోడ్డుపై తోసేసి ధ్వంసం చేశాడు. అక్కడి నుంచి హుటాహుటిన ద్విచక్ర వాహనంపై పరారీ అయ్యాడు. నిత్యం రద్దీగా ఉండే ఆ మార్గంలో చిరు వ్యాపారి బండిని దౌర్జన్యంగా తోసేయడంపై స్థానికులు, పానీ పూరి ప్రియులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా పానీపూరి బండి నడుపుకుంటున్న ప్రదీప్ ఎంతో సౌమ్యుడనీ, అలాంటి వ్యక్తి పొట్ట కొట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.

పానీపూరి బండి తోసేయడంతో బాధితుని ఆవేదన

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE:TIRUPATI.

S.O.P. 10/2024

P.Aparna Lakshmi, C/o. T. Sreenivasa Rao, Hindu, aged about 53 years, D.No. 10-91, Bharathi Nagar, Newpet, Chandragiri Village, Chittoor Dist., ...Petitioner

Vs

NIL ...Respondents

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పైన చూపబడిన పిటిషనర్ పి.అపర్ణలక్ష్మి గారు క్రింది షెడ్యూలు నందు చూపబడిన మరణించినటువంటి "పరమాత్ముని మోహన్" డిపాజిట్స్ మొత్తం రూ॥2,80,000/- తీసుకొనుటకు గాను పై కోర్టు వారి ఎదుట సకసెషన్ సర్టిఫికేట్ కొరకు దాఖలు చేసి ఉన్నారు.

కావున ఎవరికైనను ఎటువంటి ఆక్షేపణలు ఉన్నచో అటువంటి వారు తేది 20.01.2025వ తేదీన ఉదయం 10:30 గం॥లకు పై కోర్టు ఎదుట హాజరై వారి యొక్క ఆక్షేపణలు తెలుపవచ్చును. అట్లు లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.

Schedule

1. 12-10-2015: FDR A/c No. 573445110000068 for Rs. 40,000 with Bank of India, Chandragiri Branch.
2. 13-7-2016: FDR A/c No. 573445110000217 for Rs. 60,000 with Bank of India, Chandragiri Branch.
3. 13-07-2016: FDR A/c No. 573445110000386 for Rs. 60,000 with Bank of India, Chandragiri Branch.
4. 08-08-2016: FDR A/c No. 573445110000222 for Rs. 60,000 with Bank of India, Chandragiri Branch.
5. 19-08-2016: FDR A/c No. 573445110000238 for Rs. 60,000 with Bank of India, Chandragiri Branch.

Total Amount Deposited in Rs: 2,80,000/-

ఇట్లు

కొత్తపల్లి అజేయకుమార్

పిటిషినర్ తరపు న్యాయవాది, తిరుపతి

సెల్: 9849072772